

హనుమకొండ చౌరస్తాలో ఉత్సాహంగా స్టెప్పు లేస్తున్న యువతులు

**ఆవేశం వద్దు.. ఆలోచన చెయాలె..**

చర్చ పెట్టాలె.. రేపటి భవిష్యత్తు మీది

వరంగల్ చైతన్యం ఉన్న జిల్లా..

ఉద్యమనాయకుడు సుధీర్‌ను గెలిపించాలి

*- రోడ్‌షోలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్*



రోడ్‌షోలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, చిత్రంలో అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి సుధీర్‌కుమార్, పక్కన మాజీ మంత్రి ఎర్రబెల్లి, దాస్యం వినయ్ భాస్కర్



హనుమకొండ చౌరస్తాలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్ షోకు హాజరైన అశేష జనవాహిని

# ఓరుగల్లు.. పోరుగల్లు

**చైతన్యమున్న జిల్లా వరంగల్.. సమైక్య రాష్ట్రంలో ఈ జిల్లాకు అన్యాయం**

జననేత కేసీఆర్‌కు ఓరుగల్లు జనం బ్రహ్మరథం పట్టారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో ఆదివారం రాత్రి బస్సుయాత్ర ద్వారా చేరుకున్న బీఆర్ఎస్ అధినేతకు అడుగడుగునా నీరాజనం పలికారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి హనుమకొండ చౌరస్తాకు చేరుకున్న కేసీఆర్‌కు బోనాలు, మంగళహారతులతో మహిళలు, బీఆర్ఎస్ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కేసీఆర్‌ను చూసేందుకు, ఆయన ప్రసంగం వినేందుకు వరంగల్ పార్లమెంట్ సెగ్మెంట్ నుంచి ఉప్పెనలా కదిలొచ్చారు. నగరంలో అడుగుపెట్టినప్పటి నుంచి కిలోమీటర్ల దూరం వెంట వచ్చిన జనంతో ఆ ప్రాంతమంతా గులాబీ వనంలా మారింది. మాట్లాడుతున్నంత సేపు ఆసక్తిగా విన్న ప్రజలు, వారి కెమెరా కళ్లన్నీ కేసీఆర్ వైపు చూస్తుండగా జై కేసీఆర్, జై తెలంగాణ నినాదాలతో హోరెత్తించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను తూర్పార పట్టినప్పుడు ఈలలు, చప్పట్లు కొట్టి ప్రతిస్పందించారు. రాత్రి 7.37 నుంచి రాత్రి 8.25 గంటల వరకు ఉత్సాహంగా సాగిన కేసీఆర్ రోడ్ షో అశేష జనం తరలిరావడంతో గ్రాండ్ సక్సెస్ అయ్యింది. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని పెంచింది.

*– వరంగల్, ఏప్రిల్ 28(నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

# జననేతకు బ్రహ్మరథం

**బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు జననీరాజనం**

**కేసీఆర్ వరంగల్ రోడ్‌షో సూపర్ సక్సెస్**

- కార్నర్ మీటింగ్‌కు ఉప్పెనలా కదిలొచ్చిన జనం
- బోనాలు, మంగళ హారతులతో మహిళల ఘన స్వాగతం
- ఆకట్టుకున్న కళాకారుల ఆటాపాటలు
- హోరెత్తిన జై కేసీఆర్.. జై తెలంగాణ నినాదాలు
- గులాబీ వనమైన హనుమకొండ చౌరస్తా
- ఆలోచింపజేసిన 'వద్దురా నాయనా.. ఈ కాంగిరేసు పాలన' పాట
- సెల్ కెమెరా కళ్లన్నీ కేసీఆర్ వైపే
- బీజేపీ, కాంగ్రెస్‌ను తూర్పార పట్టిన కేసీఆర్



శరీరంపై కేసీఆర్ బొమ్మతో బాలుడు



కేసీఆర్‌కు పూలతో స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ శ్రేణులు



రోడ్ షోలో బీఆర్ఎస్ జెండా ఎగరేస్తున్న కళాకారుడు

**బీఆర్ఎస్ హయాంలోనే సమగ్ర అభివృద్ధి**

- కాళేశ్వరంతో ఉమ్మడి జిల్లాలో పుష్కలంగా పంటలు
- కొత్తగా ఐదు మెడికల్ కాలేజీల నిర్మాణం
- ఆకాశాన్ని తాకేలా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం

**హామీలు నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వం**

**బీజేపీ వరంగల్‌కు అన్యాయం చేసింది**

- కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఇయ్యలేదు
- కడియం శ్రీహరి మోసగాడు.. ఆయన పదవి పోతుంది
- మూడు నెలల్లో స్టేషన్ ఘన్‌పూర్ ఉప ఎన్నిక ఖాయం
- వరంగల్ రోడ్‌షోలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
- బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి సుధీర్‌కుమార్ తరపున ప్రచారం

వరంగల్, ఏప్రిల్ 28(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఓరుగల్లు పోరుగల్లు అని, పోరాటాలకు నిలయమని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో వరంగల్‌తో తనకు ఎంతో అనుబంధం ఉన్నదని చెప్పారు. 1969లో తెలంగాణ ఉద్యమ సమయంలో జయశంకర్ సారు ప్రత్యేక రాష్ట్ర పోరాటంలోకి వచ్చారని, మలిదశ పోరాటంలో ఆయన కల నెరవేరిందని పేర్కొన్నారు. సమైక్య రాష్ట్రంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు తీవ్రంగా అన్యాయం జరిగిందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ హయాంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రగతి పథంలో సాగిందని చెప్పారు. ఎస్సారెస్పీకి గతంలో నీళ్లు ఉండేవి కాదని, కాళేశ్వరం ప్రాజెక్టుతో ఉమ్మడి జిల్లాలో పంటలు పుష్కలంగా పండాయని అన్నారు. కాళేశ్వరం కట్టిన తర్వాతే పరకాల, భూపాలపల్లి, వర్ధన్నపేట, నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, పాలకుర్తి నియోజకవర్గాల్లో సాగునీరు అందిందని వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వరంగల్‌లో ఆకాశమంత ఎత్తులో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను నిర్మించిందని అన్నారు. దేశంలోనే అతి పెద్ద టెక్స్‌టైల్ పార్కును పరకాల నియోజకవర్గంలో చల్లా ధర్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్మించుకున్నామని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో ఒక్క మెడికల్ కాలేజీ ఉంటే.. బీఆర్ఎస్ ప్రభుత్వం జనగామ, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు, నర్సంపేటలో కొత్తగా మెడికల్ కాలేజీలను నిర్మించిందని చెప్పారు. బీఆర్ఎస్ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్ తరపున పార్టీ అధినేత కేసీఆర్ ఆదివారం వరంగల్‌లో రోడ్ షో నిర్వహించారు. హనుమకొండ చౌరస్తాలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.



కేసీఆర్ రాక కోసం ఎదురుచూస్తున్న ప్రజలు

## తెలంగాణ కోసం కొట్లాడేది బీఆర్ఎస్సే

ఏమేమో చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఒక్క హామీని నెరవేర్చడం లేదని కేసీఆర్ అన్నారు. కేంద్రంలో పదేండ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి, ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు అన్యాయం చేసిందన్నారు. విభజన చట్టంలో పేర్కొన్న కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని మోదీ గుజరాత్‌కు తరలించారని చెప్పారు. బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీని ఏర్పాటు చేయలేదని అన్నారు. తెలంగాణకు ఏమీ చేయని కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు మన గోదావరి నీళ్లను తమిళనాడుకు తరలించుకుపోతున్నదని అన్నారు. అడ్డుకోవాల్సిన రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అంగీకరిస్తున్నదని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం వస్తే అచ్ఛేదిన్ వస్తాయని అన్నారని, ఇప్పుడు సచ్చేదిన్ వచ్చాయని విమర్శించారు. తెలంగాణ కోసం కొట్లాడేది బీఆర్ఎస్ ఒక్కటేనన్నారు. వరంగల్ ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ తరపున స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరి మోసగాడని, పిలిచి ఉప ముఖ్యమంత్రి పదవి ఇస్తే ద్రోహం చేశారని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు మూడు నెలల్లో కడియం శ్రీహరి పదవి పోతుందని, స్టేషన్ ఘన్‌పూర్ ఉపఎన్నికలో టి.రాజయ్య గెలుస్తారని చెప్పారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరడం తో కడియం శ్రీహరి తనకు తానే రాజకీయ సమాధి కట్టుకున్నారని అన్నారు. మాజీ ఉపముఖ్యమంత్రి టి.రాజయ్య, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూదనాచారి, బండా ప్రకాశ్, బస్వరాజు సారయ్య, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీ, జోగినపల్లి సంతోష్‌కుమార్, బీ ఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, నన్నపునేని నరేందర్, జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, మాజీ చైర్మన్లు నాగుర్ల వెంకటేశ్వర్లు, కె.వాసుదేవరెడ్డి, సుందర్‌రాజు, మర్రి యాదవరెడ్డి పాల్గొన్నారు.

## కెప్టెన్ నివాసంలో బస

హనుమకొండ, ఏప్రిల్ 28 : రోడ్‌షో అనంతరం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదివారం రాత్రి హనుమకొండ హంటర్‌రోడ్డులోని మాజీ మంత్రి కెప్టెన్ లక్ష్మీకాంతారావు నివాసానికి చేరుకున్నారు. అక్కడే ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ నేతలలో పార్లమెంట్ ఎన్నికల వ్యూహం, తదితర అంశాలపై చర్చించనున్నారు. రాత్రి అక్కడే బస చేస్తారు. సోమవారం ఉదయం ఖమ్మం బయలుదేరి అక్కడ నిర్వహించే రోడ్‌షోలో పాల్గొననున్నారు.



కెప్టెన్ నివాసంలో పార్లమెంట్ ఎన్నికల వ్యూహంపై బీఆర్ఎస్ పార్టీ నేతలతో చర్చిస్తున్న కేసీఆర్